


25 నుంచి చిన్న పిల్లల యోగా శిబిరం

ప్రజాశక్తి - కడప అర్బన్

పటేల్ రోడ్ లోని మిత్ర యోగా సెంటర్‌లో మూడు వారాలపాటు నిర్వహించబడే వేసవి ప్రత్యేక చిన్నపిల్లల యోగా శిబిరాన్ని ఈనెల 25 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కల్పన, డాక్టర్ రంగనాథ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యోగా శిబిరానికి 8 నుంచి 15 ఏళ్ల వయసు లోపల పిల్లలను తల్లిదండ్రులు పంపించవచ్చని తెలిపారు. రోజూ ఉదయం 7: 30 నుంచి 9 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. యోగా శిక్షణలో పిల్లల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, సృజనాత్మకతలను పెంపొందించడానికి, సానుకూల దృక్పథం ఏర్పడడానికి, శరీరక, మానసిక దృఢత్వానికి అవసరమయ్యే యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, షట్క్రియలు వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. వివరాలకు 9848861206, 7013238986 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అమృత్ 2.0 స్కీమ్‌కు గ్రహణం

- రూ.462 కోట్ల పనులు నిలిపివేత
- మరో టెండరు ఆలోచనలో కూటమి సర్కారు
- కడప, బద్వేల్, జమ్మలమడుగు ఆశలకు సమాధి



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో అమృత్ 2.0 స్కీమ్ అమలుకు గ్రహణం పట్టింది. 2024 డిసెంబర్‌లో పిలిచిన టెండర్లను కూటమి సర్కారు హోల్డ్‌లో పెట్టింది. ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మున్సిపాలిటీలు భాగస్వామ్యంతో నిర్మించాల్సిన అమృత్ 2.0 తాగునీటి సరఫరా పథకం అమలుకు నోచుకోవడం లేదు. రూ.462 కోట్ల నిధుల్లో కేంద్రం వాటా కింద రూ.151 కోట్లు, రాష్ట్ర వాటా కింద రూ.255 కోట్లు, కార్పొరేషన్ వాటా కింద రూ.13.68, 15 ఫైనాన్స్ నిధుల నుంచి మరో రూ.33.12 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. 2024 మార్చి మూడున నిర్వహించిన టెండర్ నిర్వహించింది. అరబిందో, బిఆర్ సిసిఎల్ జాయింట్ వెంచర్ కంపెనీ కాంట్రాక్టును దక్కించుకున్నాయి. 2024 మార్చి నుంచి 2026 మార్చి లోపు పనులు పూర్తి చేయాలని గడువును నిర్దేశించింది. అమృత్ 2.0 ఫేజ్-1 పనుల్లో భాగంగా బ్రహ్మసాగర్ రిజర్వాయర్ ఇన్‌టెక్ వేల్‌లో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించాల్సి ఉంది. దీనికి 45 కిలో మీటర్ల పరిధిలో ట్రీట్మెంట్ సంప్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అక్కడి నుంచి ఎలెవేటెడ్ లెవెల్ సర్ఫ్ రిజర్వాయర్ (యుఎల్ఎస్ఆర్) ద్వారా కడప నగరానికి సమీపంలోని బండికనుమకు 9.5 మిలియన్ ఎంఎల్‌డి శుద్ధ జలాన్ని సరఫరా చేయనుంది. అక్కడి నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్ల ద్వారా నగరానికి సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. కాంట్రాక్టు వెంచర్ కంపెనీ అమృత్ 2.0 ఫేజ్-1 సంబంధించి సర్వే పనులను సైతం పూర్తి చేసింది. బండికనుమ దగ్గర 13 ఎకరాల స్థలం, బ్రహ్మసాగర్ దగ్గర అప్రోచ్ రోడ్డు సహా తొమ్మిది ఎకరాల స్థలం రెవెన్యూ యంత్రాంగం కేటాయించాలి. బ్రహ్మసాగర్ ఇన్‌టెక్ వాల్ నిర్మాణ పనులకు 45 కి.మీ మేర జిల్లా నీటిపారుదల శాఖ, ఎన్‌హెచ్ డిపార్టుమెంట్‌లు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. మౌలిక వసతుల కల్పన అనంతరం కాంట్రాక్టు సంస్థ అమృత్ 2.0 పనులు చేపట్టాల్సి ఉంది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడం, రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో అమృత్ 2.0 స్కీమ్‌ను నిలిపేసింది. మరోసారి టెండరు పిలిచే ఆలోచనల్లో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని కడప, బద్వేల్, జమ్మలమడుగు పట్టణాలకు శుద్ధ జలాన్ని అందించడానికి ఐదేళ్ల సమయం తీసుకునే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది.

సివిల్స్‌లో మెరిసిన జిల్లా వాసులు

ప్రజాశక్తి-చెన్నూరు/కడప టౌన్

అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యుపిఎస్‌సి నిర్వహించిన సివిల్స్-24 పరీక్షల్లో కడప జిల్లాకు చెందిన ఇద్దరు మెరిశారు. చెన్నూరుకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి 151వ ర్యాంకు, కడప నగర రాజుపేటకు చెందిన ధనుష్ 232వ ర్యాంకు సాధించారు. చెన్నూరు చెందిన నేటూరు శ్రీకాంత్‌రెడ్డికి సివిల్స్‌లో 151వ ర్యాంకు సాధించి సత్తా చాటించాడు. గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి కుమారుడు మొదటి రెండు ప్రయత్నాలు సివిల్ ప్రిలిమినరీ మెయిన్స్ పాసయ్యాడు. తాజా సివిల్ ఫలితాల్లో 151వ సాధించాడు. ఇండోర్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. సివిల్స్‌లో ర్యాంక్ సాధించినందుకు తల్లిదండ్రులు, బంధువులు అభినందనలు తెలియజేశారు.



శ్రీకాంత్‌రెడ్డి 151వ ర్యాంకు



ధనుష్ 232వ ర్యాంకు

కడప నగరంలోని నాగరాజుపేటకు చెందిన ఫూల ధనుష్ ఆల్ ఇండియా సివిల్ సర్వీస్‌లో 232వ ర్యాంక్ సాధించారు. 2023 సివిల్స్ ఫలితాల్లో ధనుష్‌కు 480 ర్యాంకు సాధించారు. ఐఆర్ఎస్ సర్వీస్‌లో ప్రొబెషనరీ ఆఫీసర్‌గా సిమ్లాలో పనిచేస్తున్నారు. పట్టువదలకుండా రెండో సారి సివిల్స్‌లో ధనుష్ ఉత్తమ ప్రతిభ చూపారు. 232వ ర్యాంకు సాధించారు. ఫూల ధనుష్ తల్లిదండ్రులు ఫూల శ్రీనివాసులు, తల్లి నాగమణి, పెదనాన్న చలపతి బిసి వెల్ఫేర్ అధికారి. ధనుష్ తల్లిదండ్రులు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తండ్రి ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్, తల్లి రైల్వేలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఫూల ధనుష్ ఆల్ ఇండియా సివిల్ సర్వీస్‌లో 232 ర్యాంక్ సాధించినందుకు బంధువులు, సన్నిహితులు అభినందనలు తెలియజేశారు.

కార్మికులను తొలగించడం అన్యాయం

రిటైర్‌మెంట్ వయస్సు 62కు పెంచాలి
మున్సిపల్ యూనియన్ నాయకుల డిమాండ్
విధులు బహిష్కరించి కార్పొరేషన్ ఎదుట ధర్నా



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకర రవి

ప్రజాశక్తి - కడప అర్బన్

కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులను 60 సంవత్సరాల వయస్సు సాకు చూపి తొలగించడం అన్యాయమని, రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకర రవి డిమాండ్ చేశారు. మంగళవారం విధులను బహిష్కరించి కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనది కాదన్నారు. రిటైర్‌మెంట్ అయిన వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. పెన్షన్ రూ.10, 000 ఇవ్వాలని పేర్కొన్నారు. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని చెప్పారు. అడిషనల్ వర్కర్స్‌కు పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన వేతనాలు ఇవ్వాలని తెలిపారు. ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, 9 మంది పెండింగ్ డ్రైవర్లకు రూ.24,500 వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. ధర్నా దగ్గరికి మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి వచ్చి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూల ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏప్రిల్ వేతనం పూర్తిస్థాయిలో ఇస్తామని చెప్పారు. ఒకవేల 60 సంవత్సరాలు నిండిన వారిని తొలగిస్తే వారికి అడిషనల్ వర్కర్‌గా ఉద్యోగం ఇచ్చి తమ వంతుగా ఆదుకుంటామని తెలిపారు.ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోతే నగరంలో సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ఇత్తడి ప్రకాష్, సుంకర కిరణ్, కార్మికులు పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలను తొలగించడమే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదని, జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ తోపాటు ఎస్ఇ శోక్ కుమార్, ఇన్‌ఛార్జీ డిఆర్ఒ వెంకటపతి హాజయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందిం చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వారికి సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని కమిటీ సభ్యులైన అధికారులను ఆదేశించారు. నిమ్న వర్గాల ప్రజలపై వివక్ష, అఘాయిత్యాలు జరగకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. గత సమావేశంలో చర్చించిన విషయాలలో చాలా అంశాలను పరిష్కరించామని, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు అన్ని మండలాల్లోని ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా అవగాహన పెంచాలన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే పోక్సో చట్టం, బాల్య వివాహాలు నిరోధక చట్టం పైన ప్రజల్లో అవగాహన సదస్సులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం గత సమావేశంలో సంబంధిత కేసుల యాక్షన్ టెకెన్ రిపోర్టును అంశాలను సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి చదివి వినిపించారు. కార్యక్రమంలో అన్ని కడప, జమ్మలమడుగు, బద్వేలు డివిజన్ల ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, సంబందిత డివిజన్ల డిఎస్‌పిలు, ఎస్‌సి కార్పొరేషన్, కమిటీ సభ్యులైన సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి - కడప



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని సూచనల మేరకు మంగళవారం సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కడప పురుషుల కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. శిక్ష నుంచి ఉపశమనం పొందేందుకు అర్హత ఉన్న ఖైదీలను గుర్తించడం, ఖైదీలు శిక్షకాలంలో సగం లేక సగానికి పైగా జైల్లో ఉండి బెయిల్ ప్రార్థనను హైకోర్టు తిరస్కరించిన విషయాలు వివరించారు. ఉచిత న్యాయ సాయం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 గురించి తెలియజేశారు. అనంతరం ప్రిసన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సందర్శించారు. కారాగారాల సూపరింటెండెంట్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది ఎం. చంద్రకాంతమ్మ, అసిస్టెంట్ లీగలై డిఫెన్స్ కౌన్సిల్‌లు ప్రవీణ్ కుమార్, సౌజన్య, అక్బర్ అలీ, రవితేజ, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

డిఎస్‌సి ఉచిత కోచింగ్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి-కడప అర్బన్ : యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిఎస్‌సి ఉచిత కోచింగ్‌ను జిల్లాలోని అభ్యర్థులు వినియోగించుకోవాలని డిఇఒ షేక్. షంషుద్దీన్ పిలుపు నిచ్చారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఇఒ ఉచిత కోచింగ్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ, విద్యారంగ పరిరక్షణ కోసం నిరంతరం పాటుపడుతున్న యుటిఎఫ్ ఉచిత కోచింగ్ ను నిర్వహించ తలపెట్టడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల పోరాటాలకే పరిమితం కాకుండా, ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో సైతం యుటిఎఫ్ పాలుపంచుకోవడం, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడంలో తమ వంతు పాత్రను పోషించడం మంచి పరిణామమన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగం నానాటికి సంక్షోభంలోకి నెట్టబడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యను, ఊరి బడిని కాపాడుకునేందుకు యుటిఎఫ్ నిరంతరం శ్రమిస్తుందన్నారు. కోచింగ్ అవగాహన సదస్సును ఈనెల 24న ఉదయం 9:30 గంటలకు కడపలోని యుటిఎఫ్ భవన్‌లో నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఏజాస్ అహమ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.రూతు ఆరోగ్య మేరీ, డి.కృష్ణా రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్ కార్యవర్గ సభ్యులుజి.గోపీనాథ్,రామకేశవ, కేదార్‌నాథ్, బి.చంద్రశేఖర్, సుబ్బారావు, కరిముల్లా, శివశంకర్, బాబు, ప్రసాద్‌రెడ్డి, కడప ఎంఇఒ గంగిరెడ్డి, డిసిఈబి సెక్రటరీ విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసులకు యోగా సాధన అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

పోలీసులకు యోగా సాధన ఎంతో అవసరమని బెటాలియన్ కమాండెంట్ కె. ఆనంద రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం భాకరాపేటలో ఉన్న 11వ బెటాలియన్‌లో ఇంటాక్ కడప చాప్టర్ ఆధ్వర్యంలో యోగా శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కమాండెంట్ మాట్లాడుతూ యోగా సాధన ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఒత్తిళ్లను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. వృత్తిపరమైన ఒత్తిడి నుంచి దూరం కావచ్చని, ప్రతిరోజు క్రమం తప్పని యోగ సాధన వల్ల మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. డాక్టర్ ఆర్ రంగనాథ్ రెడ్డి మాట్లాడుతూ యోగా సాధన అనేది మత విశ్వాసాలకు సంబంధంలేని ఒక శాస్త్రీయ ప్రక్రియ అని, జీవనశైలి వల్ల వచ్చే అనేక సమస్యలకు యోగ ద్వారా పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం పోలీసుల చేత యోగాసనాలు చేయించారు.

హత్య కేసులో నలుగురు నిందితులు అరెస్టు

- రెండు కత్తులు, మూడు సెల్ ఫోన్లు, స్కూటీ స్వాధీనం

ప్రజాశక్తి - కడప అర్బన్




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి

నగరంలోని బిల్డప్ వద్ద ఈ నెల 15న హత్యకు గురైన సాదక్‌వల్లి కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 2 కత్తులు, 3 సెల్ ఫోన్లు, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి అశోక్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్య చేసిన నిందితులను రామరాజుపల్లె దగ్గర ఉన్న వైస్ జంక్షన్‌లో తాలూకా పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. ఎ- 1 నిందితుడు రాయప్ప అనుచరుడైన వెంకటేశును 2024, జూలై 19న సాదక్ వల్లి చంపాడని పేర్కొన్నారు. ఈ కేసులో సాదక్ వల్లిని పోలీసుల అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారని తెలిపారు. సాదక్ వల్లి జైలు నుంచి బయటికి వచ్చాడన్న విషయం తెలుసుకున్న ఎ-1 నిందితుడు రాయప్ప, అతని స్నేహితులు ప్రతీకారంగా సాదక్‌వల్లిని హత్య చేశారని చెప్పారు. కత్తులతో పొడిచి హతమార్చారని పేర్కొన్నారు. ఈ విషయంపై హతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని తెలిపారు. డిఎస్‌పి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో తాలూకా సిఐ జి.వెంకటేశ్వర్లు, ఎస్ఐలు తులసి నాగ ప్రసాద్, తాయర్ హుస్సేన్, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ విద్యాసాగర్, నాగరాజు, పోలీసులు సుబ్బయ్య పుల్లయ్య రఘు రాముడు నిందితులను అరెస్టు చేశారని చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో రాయప్ప, గౌస్ బాషా, బాలస్వామి, వెంకటేష్ ఉన్నారని పేర్కొన్నారు. వీరిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. రౌడీషీటర్ల కదలికపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారని చెప్పారు.

ఐటి కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - వల్లూరు



ధృవీకరణ పత్రాలు అందుకున్న విద్యార్థులు

విద్యార్థులకు ఐటి కోర్సు లతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వల్లూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎం. సురేష్ బాబు అన్నారు. మంగళవారం ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులు వృత్తి విద్య కోర్సులో ఇంటర్న్ షిప్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఒకేషనల్ ఐటి కోర్స్ ట్రైనర్ ఎస్. శోభనాచారి ఆధ్వర్యంలో కడపలో గల గ్లోబల్ కాలేజ్ , వల్లూరు మండలంలోని దుగ్గాయ పల్లి సచివాలయంలో 13మంది ఒకేషనల్ ఐటి విద్యార్థులు శిక్షణ పొందారు.

పశు పోషణ రైతులకు ఆర్థిక బలం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : గ్రామీణ స్థాయిలో పశు పోషణ ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమేప్రభుత్వాల ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జెడి డాక్టర్ శారదమ్మ అధ్యక్షతన పశుసంవర్ధక శాఖ జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచమంతా పాడి, పశు సంపద పైనే ఆధారపడి జీవిస్తోందని తెలిపారు. పశుపక్షాదులు, పెంపుడు జంతువుల సంరక్షణతోనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖలను మరింత పటిష్టం చేసే దిశగా భారత ప్రభుత్వం నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని పశుసంవర్ధక శాఖ ద్వారా రైతులు ఆర్థికంగా ఎదగాలన్నారు. జిల్లా ఆర్థిక ప్రగతిలో వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు పశుసంవర్ధక శాఖ కీలకమైన పాత్ర పోషిస్తోందని చెప్పారు. జిల్లాలో ఔత్సాహిక పాడి, పాల ఉత్పత్తి దారులను ప్రోత్సహించి, యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్డీఏ, డ్వామా పీడీలు ఆనంద్ నాయక్, ఆదిశేషారెడ్డి, పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, పశుసంవర్ధక శాఖ డిడిలు, ఏడీలు, పశు వైద్యులు పాల్గొన్నారు.

గొప్ప మానవతావాది లెనిన్ : సిపిఎం

ప్రజాశక్తి కడప అర్బన్



లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తన జీవితం మొత్తాన్ని శ్రామిక ప్రజల విముక్తి కోసం అంకితం చేసిన గొప్ప మానవతావాది లెనిన్ అని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని మృత్యుం జయకుంటలో ఉన్న సిపిఎం కార్యాలయంలో లెనిన్ 155వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెనిన్ బాల్యం మినహా మిగిలిన కాలంలో అత్యధిక భాగం జైల్లోనూ, రహస్య జీవనంలోనూ గడిపారన్నారు. కార్మిక వర్గ రాజ్య స్థాపన కోసం విశేషంగా కృషి చేశారని తెలిపారు. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో, నిర్దిష్టంగా అమలు చేయడం ఎలాగో కార్మిక వర్గానికి బోధించాడని చెప్పారు. ఆ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా మానవ సమాజ చరిత్రలోనే తొలిసారిగా రష్యాలో సోషలిస్టు విప్లవం జయప్రదం చేశారన్నారు. శ్రామికరాజ్యం ఏర్పడి తొలిసారి ప్రజలకు అనుకూలమైన విధానాలు అమలు చేసిందన్నారు. ఉద్యోగం చేయటం రాజ్యాంగ హక్కుగా మార్చిందన్నారు. అందరికీ ఉచిత విద్య, వైద్యం అందించిందన్నారు. ప్రస్తుతం మనదేశంలో మతోన్మాద శక్తులు రోజురోజుకూ ప్రజల మధ్య చీలికలను తీసుకు వస్తూ అనైక్యతను పెంచి పోషిస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలో దారిద్ర్యం, నిరుద్యోగం, పేదరికం, అసమానతలు రోజు రోజుకు పెరుగుతున్నాయన్నారు. పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయ విధానం సోషలిజం మాత్రమేనని సోషలిస్టు వ్యవస్థ సాధన కోసం కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు బి. దస్తగిరి రెడ్డి, నాయకులు కుమారస్వామి రెడ్డి, నారాయణ రెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ, మహేష్ పాల్గొన్నారు.

వారసత్వ సంపదను రక్షించుకుందాం

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగర పాత మున్సిపల్ కార్యాలయంలో ఎంతో చరిత్ర ఉన్న మూడు సింహాల అశోక చక్రవర్తి స్థూపాన్ని కడప నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మ గాంధీ విగ్రహం సమీపాన కానీ , ఏడు రోడ్ల కూడలి వద్ద కానీ ఏర్పాటు చేయాలని జెకె యూత్ అధ్యక్షులు ఖాదర్ బాషా కోరారు. మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయంలో ఉన్న స్థూపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థూపం చుట్టూ ప్రహరీ ఉండి ఎంతో రక్షణగా ఉండేదని తెలిపారు. ప్రస్తుతం చెత్త సేకరణ వాహనాలను అక్కడ ఉంచుతున్నారని పేర్కొన్నారు. ఇక్కడ స్థూపం ఉండడం చాలా బాధాకరమైన విషయమని చెప్పారు. నగరపాలక అధికారి మనోజ్ రెడ్డి సందర్శించి స్థూపాన్ని మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని

మర్యాదపూర్వకంగా కలసిన ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామినిని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టులోని జడ్జి చాంబర్‌లో ఉన్న నూతన జడ్జికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. న్యాయ వ్యవస్థ, పోలీస్ శాఖ కలిసి సమన్వయంతో కృషిచేసి ప్రజలకు న్యాయం అందుబాటులో ఉండేలా చూసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కేసుల పరిష్కారం, మహిళల భద్రత, నేరాల నివారణ పై వారు మాట్లాడారు. **కడవ :** అలాగే కడప జిల్లా జ్యూడిషల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు జిల్లా ప్రధాన న్యామూర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు. సిబ్బంది సమస్యలు చెప్పుకునేందుకు ప్రతి నెలా మూడవ శనివారం అవకాశం ఇస్తున్నట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. త్వరలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగోన్నతలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జ్యూడిషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.శశికాంత్ రెడ్డి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లాకు రాక

ప్రజాశక్తి - కడప : రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్నారైల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ నెల 23, 24 తేదీల్లో రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నట్లు ఇన్‌ఛార్జి డిఆర్ఒ వెంకటపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల 23న తిరుపతి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రి 9 గంటలకు కడప ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారని పేర్కొన్నారు. 24న కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను సందర్శిస్తారన్నారు. అనంతరం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా కలెక్టర్ తో కలసి ఎం ఎస్ ఎం ఈ పై సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారు. తిరిగి మధ్యాహ్నం 1.30 గంటల నుండి 3 గంటల వరకు సెర్ప్ కార్యక్రమాలపై జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు.

ఎడిఫై పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఎలాంటి గుర్తింపు లేకుండా విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తూ అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఎడిఫై పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతకొమ్మదిన్నెలోని ఎడిఫై పాఠశాల యాజమాన్యం ఎలాంటి అనుమతులు లేకుండా చదువు పేరుతో కోట్ల రూపాయలు సంపాదించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు మోసం చేసే విధంగా అక్రమ అడ్మిషన్ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎడిఫై పాఠశాల యాజమాన్యం పలుమార్లు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటే మండల విద్యాశాఖ అధికారులు తిరస్కరించారని తెలిపారు. అయినప్పటికీ పాఠశాల యాజమాన్యం అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తుందని చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ధైర్యంగా అక్రమ అడ్మిషన్లు చేస్తూ న్నారని పేర్కొన్నారు. దీనిపైన పలుమార్లు వార్తాపత్రికలలో వచ్చినా కూడా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యం కలుగు తుందని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అక్రమ అడ్మిషన్లు చేస్తున్న ఎడిఫై పాఠశాల యాజమాన్యం పై కఠిన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మోహన్, ఉదయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న గౌస్‌పీర్

జిల్లా అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. మంగళవారం కాగితాల పెంటలోని పార్టీ జోనల్ కార్యాలయంలో విలేక రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధిలో పరుగు పెట్టిందని పేర్కొన్నారు. నగరంలో బుగ్గ వంక పై బ్రిడ్జిల నిర్మాణం, రిమ్స్ ఆసుపత్రి, వైవీయూ, ఇందిరమ్మ ఇల్లులు నిర్మించి ఇచ్చారని చెప్పారు. ఇంతటి ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని తెలిపారు. జిల్లా మరింత అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ఎన్నికల్లో 50 డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. తన జోన్‌లో 17 డివిజన్లు వస్తాయని చెప్పారు. వీరందరినీ కార్పొరేటర్లుగా గెలిపించుకుని వైఎస్ షర్మిలకు గిఫ్టుగా అందజేస్తానని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి ని చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎం.వి. రఫిక్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షులు గఫార్, సిరాజుద్దీన్, మైనార్టీ నగర అధ్యక్షులు ముబారక్ బాషా, ఎస్‌సి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు శీలం గంగయ్య, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు ఎస్.ఎం.డి సిద్ధిక్ పాల్గొన్నారు.

10 మంది ఎస్ఐలు బదిలీ

ప్రజాశక్తి కడప అర్బన్ :కర్నూల్ రేంజ్ పరిధిలో ఎస్ఐలను బదిలీ చేస్తూ డిఐజి కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు సంబంధించి కడప ట్రాఫిక్ ఎస్ఐ ప్రతాప్ రెడ్డిని వన్‌టౌన్ ఎస్ఐగా బదిలీ చేశారు. రిమ్స్ ఎస్ఐ జయరాములు ట్రాఫిక్ ఎస్ఐగా, సైబర్ క్రైమ్ ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి కలమల్ల ఎస్ఐగా, కాశినాయన ఎస్ఐ , హనుమంతు ప్రొద్దుటూరు 3 టౌన్ ఎస్ఐగా, ఇక్కడ పనిచేస్తున్న యోగేంద్ర కాశినాయన ఎస్ఐగా, బి.కోడూరు ఎస్ఐ రాజు ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐగా, ఇక్కడ పనిచేస్తున్న వెంకట సురేష్ బి.కోడూరు ఎస్ఐగా, ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ బ్రహ్మంగారి మఠం ఎస్ఐగా ఇక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్ చక్రాయపేట ఎస్సైగా, ఇక్కడ పనిచేస్తున్న కృష్ణయ్య బదిలీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - వల్లూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాల కోసం మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఎస్ఎస్ఎ ఎపిసి నిత్యానంద రాజు, ఎంఇఒ లిల్లమ్మ ఆధ్వర్యంలో మండలంలోని ఆదర్శ పాఠశాల, వల్లూరు ఉన్నత పాఠశాలకు విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని అర్హతలు కలిగిన ఉపాధ్యాయుల చేత విద్యాబోధన జరుగుతుందన్నారు. ఐదు సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్క చిన్నారి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు పొందాలని సూచించారు. విజయ రెడ్డి, వల్లూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది విశ్వనాధ్ పాల్గొన్నారు.

8న జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా జడ్‌పి సర్వసభ్య సమావేశం మే 8న నిర్వహించనున్నట్లు జడ్‌పి సిఇఒ ఓబులమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం కొనసాగుతుందని తెలిపారు. జడ్‌పిటిసిలు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.



వేరు వ్యవస్థను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ రేష్మ, హెచ్ఒ మల్లేశ్వర్‌రెడ్డి

నకిలీ అరటి మొక్కలతో లోపించిన వేరు ఎదుగుదల

- పులివెందుల అరటి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రేష్మ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

నకిలీ అరటి మొక్కలతో వేరు వ్యవస్థ ఎదుగుదల లేదని పులివెందుల అరటి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రేష్మ, ముద్దనూరు ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో సంద్యాలంపల్లిలో మంగళవారం వాసుదేవరెడ్డి అనే రైతు గతేడాది నాటిన కిసాన్ ఆగ్రోటెక్ కంపెనీ వారి అరటి మొక్కలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మొక్కలు గెలలు వేయకపోగా వేరు వ్యవస్థ సరిగా లేదన్నారు. అరవ నెలలో రావలసిన పూత 9 నెలలు గడిచినప్పటికీ రాలేదన్నారు. మొక్కలు నాటి సంవత్సరం అయినప్పటికీ అరటి గెలలు కోతకు రాలేదన్నారు. ఈ మొక్కలను పరిశోధన కేంద్రంలోని ల్యాబ్‌లో పరీక్షించి నివేదిక రాగానే కంపెనీ వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తప్పనిసరిగా సంబంధిత కంపెనీ డీలర్ల నుంచి మొక్కల బిల్లును తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్ర సిబ్బంది ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ఎంపిడిఒ కుళాయమ్మ, ఎఒ రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ సభా భవనంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఖరీఫ్ ప్రణాళిక-2025పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల భూమిని ఆరోగ్యకరంగా కాపాడు కోవచ్చు అన్నారు. పంటల సాగు సమయంలో రైతులకు ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జిలు కలిసి రైతులు భూసార పరీక్షలు చేయించుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్వర రావు, ఎపి సిఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు, కంప్యూటర్, ఫార్మసీ, ల్యాబ్ గదులు, ఉపకరణ పరికరాలను పరిశీలించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఫీల్డ్ వెళ్లే సిబ్బంది ప్రతి రోజు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ఒఆర్ఎస్, జింక్ కార్నర్స్ ఉండేలా చూసుకోవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్‌సిడి, సిడి, ఆభాడిస్ సర్వే వివరాలు, గర్భిణుల రిజిస్ట్రేషన్ గురించి డాక్టర్ శ్రీకాంత్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు డిప్యూటీ వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శివప్రసాదరెడ్డి, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు రాఘవ, శోభకుమారి, రామారావు, ఫార్మసిస్ట్ జగదీశ్, సిబ్బంది పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

చిన్నగురవలూరులో బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చిన్నగురువలూరు గ్రామంలో సిఎస్ఐ చర్చి 55 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆరాధన ప్రత్యేక ప్రార్థనలో మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆయన సతీమణి ప్రభావతమ్మ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ఎడ్లచే బండలాగుడు పోటీలను మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఎంపిపి టి.లక్షు మయ్య, వైసిపి నాయకులు సివి సుబ్బారెడ్డి, జయ సుబ్బారెడ్డి, యల్లారెడ్డి, వివేకా నంద పాఠశాల కరెస్పాండెంట్ బి.నాగేశ్వరరెడ్డి, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో మెరిసిన చాపాడు విద్యార్థి

ప్రజాశక్తి - చాపాడు



నేహావర్ధిని

తెలంగాణ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ఫలితాల్లో మండల పరిధిలోని అన్నవరం గ్రామానికి చెందిన నంద్యాల నేహావర్ధిని ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంఇసి విభాగంలో 495/500 మార్కులు సాధించింది. నేహ వర్ధిని అన్నవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ ఎన్.లోకేశ్వర్‌రెడ్డి కుమార్తె. పదవ తరగతి ప్రొద్దుటూరులో అభ్యసించి 589/600 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. హైదరాబాదులోని లక్ష్య కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న నేహ వర్ధిని ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్యను పెంచండి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపిడిఒ కృష్ణమూర్తి సూచించారు. మంగళవారం మండలంలోని గురజాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 8 వారాలుగా వేతనాలు ఇవ్వని విషయం వాస్తవమే అన్నారు. ఈ బిల్లులు త్వరలోనే పడే అవకాశం ఉందన్నారు. కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని క్షేత్రస్థాయిలోని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వాతావరణ సంక్షోభంపై దృష్టి సారిస్తున్న ప్రపంచంలోని దేశాలన్నీ ఏప్రిల్ 22న ప్రపంచ ధరిత్రి దినోత్సవం జరుపుకోవడం ఆనందకరమని ఫుడ్ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవ్ అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సమగ్ర వ్యవసాయ పద్ధతులు మిద్దె తోటల పెంపకం, సేంద్రియ వ్యవసాయం, హైడ్రో ఫోనిక్స్ లాంటి అదునాతన సాంకేతికను సూచించే విధంగా వివిధ వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది లక్ష్మీపతి, లక్ష్మీప్రియ పాల్గొన్నారు.

అటు సలసల.. ఇటు విలవిల

బెంబేలెత్తిస్తున్న ఎండలు - అల్లాడిపోతున్న ప్రజలు, పగలు, రాత్రి వేళల్లో ఉక్కపోత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

నిమిషాలు గంటలు.. గంటలు వారాలు.. వారాలు నెలలుగా ఇలా ఏడాది కాలం పూర్తి అవ్వడంతో వేసవి వచ్చేసింది. ఉగాది ముగియడంతో ఎండలు మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉద యం 8 గంటలు కాగానే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. తీవ్రమైన ఎండలకు రైతులు, వ్యవసాయ కూలీలు, మరోవైపు వ్యాపారులు అల్లాడి పోతున్నారు. ఎండ తీవ్రత రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనని ప్రజలు హడలి పోతున్నారు. విపరీతమైన ఎండలకు తిరిగితే డయేరియా వ్యాధి (వీరేచనాలు) ప్రబలే అవకాశం ఉన్నట్లు వైద్యులు సూచిస్తున్నారు. వేసవిలో దప్పిక ఎక్కువగా ఉంటుంది. సరిపడ నీరు తాగకపోతే వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. వేసవికాలం అనేది నాలుగు సమశీతోష్ణ కాలాల్లో వెచ్చని కాలంగా చెప్పవచ్చు. ఇది వసంత రుతువు ఆకులు రాలే కాలం మధ్య వస్తుంది. ఈ కాలంలో ఎక్కువ గంటలు వెలుతురు (పగలు) తక్కువ గంటలు చీకటి (రాత్రిళ్లు) ఉంటుంది. ఈ కాలాలు ఖగోళ శాస్త్రం, ప్రాంతీయ వాతావరణ శాస్త్రంపై ఆధారపడి వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు తేదీల్లో ప్రారంభమవుతాయి. అయితే, భూమి దక్షిణ అర్ధగోళం వేసవి కాలమైనప్పుడు, ఉత్తర అర్ధగోళంలో శీతాకాలం వస్తుంది. దీనికి వ్యతిరేకంగా జరుగుతుంది. ఉష్ణ మండలీయ, ఉప ఉష్ణమండలీయ ప్రాంతాల్లో, వేసవి కాలం సమయంలో ఆర్ద్ర కాలం సంభవిస్తుంది. వేసవి కాలంలో ఉష్ణ మండలీయ తుఫానులు పెరిగి, ఉష్ణ మండలీయ, ఉప ఉష్ణ మండలీయ సముద్రాల్లో తిరుగుతాయి. వేసవి కాలంలో వాతావరణం వేడిగా, తేమగా, పొడిగా ఉంటుంది. భూమి సూర్యుని వైపు వంగి ఉండడం వల్ల కొన్ని ప్రదేశాలలో ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా పెరుగుతాయి. వేసవిలో సూర్యుడు ప్రకాశవంతంగా కనిపిస్తాడు. వేసవిలో మనకు అనేక కాలానుగుణ పండ్లు, కూరగాయలు లభిస్తాయి. ఎండాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి. రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తప్పక తీసుకోవాలి. ఒంటికి వదులుగా ఉండే దుస్తులు ధరించాలి. ఎండలో ప్రయాణించే వారు గొడుగు, హెల్మెట్, గౌజ్లు వాడాలి. తీసుకునే ఆహారంలో తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండేలా చూసుకోవాలి. ఇలా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటే వేసవి నుంచి ఉపశమనం పొందవచ్చు.



ఎండలకు జనాలు తిరగక వెలవెలబోతున్న రోడ్డు

రేషన్ ఇవ్వకపోతే పిల్లలకు ఎలా పెడతారు?



రెవెన్యూ కార్యాలయంలో సమస్యలు వివరిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రెవెన్యూ అధికారులు స్టాక్ పాయింట్ వద్ద రేషన్ తక్కువ ఇస్తుంటే అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు సరిపడా అన్నం ఎలా పెడతారని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, సిఐటియు కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ రూరల్ ప్రాంతంలో ఉన్న రేషన్ డీలర్లు సెంటర్లకు రేషన్ సప్లయ్ చేయకుండా వారిని ఇబ్బందుల గురి చేస్తున్నారని తెలిపారు. కొందరు డీలర్లు థంబు వేయించుకొని సరుకు ఇవ్వడం లేదన్నారు. మరికొందరు డీలర్లు అంగన్వాడీ టీచర్లపై దాడులు చేస్తున్నారన్నారు. అంగన్వాడీ సెంటర్‌కు రేషన్ రాకపోతే పిల్లలకు ఎలా అన్నం పెట్టాలని అంగన్వాడీలు మొత్తుకుంటున్నారన్నారు. థంబ్ వేయించుకుని ఎందుకు రేషన్ ఇవ్వడం లేదని అడిగితే రెవెన్యూ అధికారులు తనకు తక్కువ ఇస్తున్నారు.. నేనేం చేయాలని, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయండని డీలర్లు చెబుతున్నారని పేర్కొన్నారు. వెంటనే అంగన్వాడీ సెంటర్లకు రేషన్ సరుకులు చేర్చాలన్నారు. అంగన్వాడీ టీచర్లపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని, అదే కొనసాగితే డీఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఇచ్చిన ఫిర్యాదులతో వెంటనే కేసులు నమోదు చేసి వారిని అరెస్ట్ చేయాలన్నారు. ధర్నాలో అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, సునీత, నాగవేణి, సువార్తమ్మ, గీత, సిఐటియు నాయకులు బాబు, డేవిడ్, అంగన్వాడీ టీచర్లు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అంగన్‌వాడీ వర్కర్ భర్తపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రొద్దుటూరు పరిధిలోని అంగన్వాడీ వర్కర్ భర్తపై జరిగిన దాడిని ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు రూరల్ ప్రాంతంలో అంగన్వాడీ సెంటర్‌కు ఇవ్వాల్సిన రేషన్ సరుకులను ఇస్తామని చెప్పి రేషన్ షాప్ దారుడు అంగన్వాడీ టీచర్‌తో థంబ్ వేయించుకొని, ఒకటి రెండు రోజులు గడుస్తున్నా రేషన్ సరుకులు ఇవ్వకపోవడంతో డీలర్‌ను ప్రశ్నించారన్నారు. అధికారులు తక్కువ రేషన్ ఇస్తున్నారని దబాయించడంతో అంగన్వాడీ టీచర్ భర్తకు చెప్పడం ఆయన వెళ్లి అడగడంతో దాడి చేశారన్నారు. ఈ సంఘటనపై సంబం ధిత ఐసిడిఎస్ అధికారులు, తహశీల్దార్ స్పందించి అతని రేషన్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యుడికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకో వాలన్నారు. అంగన్వాడీలకు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుం డా సంబంధిత అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అబ్రహం, ప్రభాకర్, వెంకటయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలు వంద శాతం చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని కామనూరు కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని దొరసానిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్తపల్లి ఎలిమెంటరీ పాఠశాలను మంగళవానం వైద్య ఆరోగ్య శాఖ డిపి ఎంఒ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌ను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలను వంద శాతం చేయాలన్నారు. విద్యార్థులు, ప్రజలు, చిన్న పిల్లలు వడదెబ్బ, అతిసారకు గురికాకుండా తీసుకోవాల్సిన జగ్రత్తలపై ప్రజల్లో చైతన్యం తేవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మహాలక్ష్మి, సిహెచ్ఒ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బిఎ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీను, ఎఎన్ఎంలు సుప్రజ, జ్యోతి, సుజాత, ప్రమీల, విజయ, ఉదయలక్ష్మి, డిఇఒ ప్రసన్న, ఆశాలు లక్ష్మిదేవి, సుజాత, సుజిత, సువార్తమ్మ పాల్గొన్నారు.

సమస్యను రాజకీయం చేయొద్దు

వేంపల్లె : భార్యభర్తల సమస్యను కొందరు వ్యక్తులు రాజకీయం చేయడంతో కుటుంబాలు నాశనం అవుతున్నాయని, ఇది మంచిది కాదని పఠాన్ మునవర్, ఖాసీం వలి పేర్కొన్నారు. మంగళవారం నందిపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్ల క్రితం వీరపునాయునిపల్లె మండ లంలోని నేలతిమ్మయ్యగారిపల్లెకు చెందిన పెద్ద బాదుల్లా కుమార్తె షీరిన్ భానును వివాహం చేసుకున్నట్లు చెప్పారు. అయినప్పటి నుంచి బార్యభర్త మధ్య విభేదాలు లేవు.. భార్యను ఎప్పుడూ హించంచలేదని మునవర్ తెలిపారు. చిన్న మాట విషయంలో తన భార్య షీరీన్ పుట్టింటికి వెళ్లిందని చెప్పారు. పెద్ద మనుషులను తీసుకొచ్చి సంజాయిషీ చెప్పకపోగా చిన్న బాదుల్లా అనే వ్యక్తి ఘర్షణ జరగడానికి మూల కారణమన్నారు. చిన్న బాదుల్లా అనే వ్యక్తి రాజకీయం చేసి వేంపల్లెలోని బిడ్డాలమిట్ట ప్రాంతంలో ఉన్న అబ్దుల్‌తోపాటు మరి కొందరిని పిలుచుకొచ్చి తమ కుటుంబంపై దాడి చేశారని తెలిపారు. గ్రామస్తులు అడ్డుకోవడంతో తాము ప్రాణాలతో బయట పడ్డామన్నారు. కుటుంబ సమస్యలను రాజకీయాలకు అంటగట్టడం సరైందికాదన్నారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలి : భూపేష్‌రెడ్డి

ఎర్రగుంట్ల : సిమెంట్ పరిశ్రమలు స్థానికంగా చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని జమ్మల మడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం భూపేష్ రెడ్డి చిలమకూరు గ్రా మంలో మాట్లాడుతూ గతంలో కోరమండల్ నుంచి ఐసిఎల్ ప్రస్తుతం అల్ట్రాటెక్ ఇలా యాజమాన్యాలు మారుతున్నాయని స్థానికులను పట్టించుకోవడం లేదన్నారు. పొల్యూషన్ వలన సమీప గ్రామాల భూములు పాడవుతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారన్నారు. టెక్నాలజీ మారుతున్నా పరిశ్రమల వారు పాత మిషన్లనే వాడుతున్నారని తెలిపారు. పొల్యూషన్ తగ్గించే అధునాతన మిషన్లను తేవట్లేదని తెలిపారు. పొల్యూషన్ తగ్గించేందుకు కనీసం చెట్లు కూడా నాటడం లేదన్నారు. సిఎస్ఆర్ ఫండ్స్‌తో విద్య, వైద్యం నిమిత్తం ఏమాత్రం ఖర్చు చేయడం లేదని పేర్కొన్నారు. 1984లో పరిశ్రమలు ఇక్కడ స్థాపిం చారని, అప్పటినుంచి ఒకే కుటుంబం చేతిలో మూడు పరిశ్రమల పెత్తనం జరుగుతోందన్నారు. స్థానికులకు న్యాయం జరిగే వరకూ ఎమ్మెల్యేతో కలిసి పోరాటం సాగిస్తామని భూపేష్‌రెడ్డి తెలిపారు.

వికాస్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గాంధీరోడ్డులో ఉన్న వికాస్ స్కూల్ ప్రభుత్వ నిబంధనలు వ్యతిరేకంగా నడుస్తోందని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ డిమాండ్ చేశారు. ఆ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఎంఇఒ సావిత్రికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాస్ స్కూల్ విద్య హక్కు చట్టాలను కాలరాసేలా ఉందన్నారు. స్కూల్ యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటోందన్నారు. ప్రభుత్వ చట్టాలకు విరుద్ధంగా స్కూల్ నడుపుతూ అప్పుడే ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయనత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

పులివెందుల రూరల్ : ప్రభుత్వ కళాశాలల ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ అధికారి ఆదేశాల మేరకు కడప జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో పులివెందుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన అయిదు మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు తెలిపారు. గ్రామీణ కళాశాల విద్యార్థులు ఇలాంటి ఉద్యోగాలను పొందడం ఇతరులకు ఆదర్శమన్నారు. కళాశాల నుండి ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాధికా నాయకత్వంలో 8 మంది విద్యార్థులు హాజరవ్వగా అందులో ఐదుగురు బికామ్ విద్యార్థులు వసంత, సింధు, నీలిమ, చందన, మేరీ ఉద్యోగం సంపాదించడం చాలా గర్వకారణమన్నారు. విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.బాలనారాయణ, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లోలాగే ప్రభుత్వ పాఠశాలలో కూడా విద్యార్థులకు మంచి విద్యా బుద్ధులు నేర్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం కోసం ఉపాధ్యాయులు కపీలను ప్రోత్సహించరాదన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహాయ సహకారాలు చేసేందుకు ఎల్లపుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం హైస్కూల్ ప్లస్‌లోని ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులను ఎమ్మెల్సీ అభినందించి, ఒకొక్కరికి రూ.5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహం అందించారు. క్రీడా మైదానాన్ని పరిశీలించి క్రీడాకారులతో ఆటలపై అడిగి తెలుసుకున్నారు. ఆటస్థలానికి కాంపౌండ్ నిర్మించాలని వ్యాయామ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీని కోరారు. ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనువాసులు, డివి సుబ్బారెడ్డి, మాజీ ఎంపిటిసి జివి రమణ, సాయి కృష్ణారెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, ప్రకాష్, భాస్కర్‌రెడ్డి, శివ, పలువురు టిడిపి నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీనివాస పాఠశాలలో ఎమ్మెల్సీకి ఘన సత్కారం

స్థానిక శ్రీనివాస పాఠశాలలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. శ్రీనివాస పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ ఆ పాఠశాలను సందర్శించారు. కరస్పాండెంట్ కేశవులు ఆయనను సాదరంగా స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యను అందించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని కోరారు. వేసవి సెలవుల్లో చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలని కోరారు. చదువుతోపాటు క్రీడాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నేతలు జివి రమణ, డివి సుబ్బారెడ్డి, పోతిరెడ్డి శివ, భాను, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, పాఠశాల చైర్మన్ లక్ష్మి కాంతమ్మ, డైరెక్టర్ చంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలోనే షాదీఖానా ఏర్పాటు

- హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మహబూబ్ బాషా

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

చంద్రబాబు హయాంలోనే పులివెందులకు షాదీఖానా వచ్చిందని హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన ముస్లిం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి మాట్లాడిన మాటలు అవాస్తవమని వైసిపి ముస్లిం నాయకులు అనడం దురదృష్టకరమన్నారు. 2010లో ముస్లింలు ఈద్గా ఏర్పాటుకు 2.62 సెంట్ల భూమిని అప్పజెప్పారని, ఒక వైసిపి రౌడీషీటర్ ఆ భూమిని ఆక్రమించి, ఈద్గాను ధ్వంసం చేశారన్నారు. ఆ ఈద్గాను అప్పట్లో వైఎస్ మనోహర్‌రెడ్డి పరిశీలించారన్నారు. ఈద్గా ఏర్పాటుకు భూమిని వైఎస్ కుటుంబ సభ్యులు అప్పజెప్పలేదన్నారు. బీటెక్ రవి ఒక సమావేశంలో ఈద్గా ఏర్పాటుకు తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. వైఎస్ కుటుంబ సభ్యులు ఈద్గా ఆక్రమించిన వైసిపి రౌడీషీటర్‌కు డబ్బులు ఇచ్చారేమో కానీ.. అసలైన భూ యజమానులకు ఇవ్వలేదన్నారు. వైసిపి ముస్లిం నాయకులు వాస్తవాలు మాట్లాడాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు రహంతుల్లా, నాగిన్ బాషా పాల్గొన్నారు.

హజ్ కమిటీ డైరెక్టర్ బాషాను కలిసిన కమిషనర్

స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో రాష్ట్ర నామినేటెడ్ హజ్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన షేక్ మహబూబ్ బాషాను పులివెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది ఆర్ఐ మధు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ముద్దనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ ముంతాజ్ బేగం సూచించారు. ముద్దనూరు సెక్టార్ స్థానిక అంగన్వాడీ-3 కేంద్రంలో మంగళవారం ముంతాజ్ బేగం ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ.. పుట్టిన బిడ్డకు రెండేళ్ల లోపు మెదడు చాలా వేగవంతంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. పిల్లలకు సరైన పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాపిస్తే తల్లీబిడ్డకు ఆరోగ్యకరమన్నారు. చిరుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సిహెచ్ఒ ఉమారాణి, అంగన్వాడీ కార్యకర్త సి.కిరణ్మయి పాల్గొన్నారు.

కొండాపురం : గండ్లూరు, ఓబన్నపేట అంగన్వాడీ సెంటర్లలో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు వెంకట సుబ్బమ్మ, జి.పద్మావతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం సంజమ్మ, జ్యోతి, ఆశ సుజాత, అలివేలు, సూర్యకళ, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

ఖాజీపేట : అప్పనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోసియల్ టీచర్‌గా పనిచేస్తున్న పెంచలయ్య ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం మంగళవారం పాఠశాలలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా మైదుకూరు, ఖాజీపేట ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం నాయకులు హాజరై ఆయనను ఘనంగా సన్మా నించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.